'కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం'


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్‌బీనగర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరిగిందంటూ కాంగ్రెస్ నాయకులు ఎల్‌బీనగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..బీజేపీ పార్టీకి 8 మంది ఎంపిలను గెలిపిస్తే కృతజ్ఞత లేకుండా బడ్జెట్‌లో తెలంగాణకు ఎలాంటి కేటాయింపులు చేయకపోవటం దురదృష్టకరమన్నారు. కేంద్ర మంత్రులు, ప్రధాన మంత్రికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనేక సార్లు ప్రతిపాదనలు పంపినా పట్టించుకోలేదని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన సమస్యలను బీజేపీ ఎంపీలు పక్కన పెట్టి నరేంద్రమోదీకి బానిసలుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రధానిపై ఒత్తిడి తీసుకొచ్చి రాష్ట్రానికి నిధులు వచ్చేలా చూడాలని లేకుంటే బీజేపీ నాయకులను ఎక్కడికక్కడ నిర్బంధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శివకుమార్, సాయిరాంరెడ్డి, రుత్విక్‌రెడ్డి, మనోజ్ కుమార్, రాముయాదవ్, దర్గేష్ పాల్గొన్నారు.

సైబర్ నేరాల బారిన పడకుండా అవగాహన


కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు

వనస్థలిపురం: రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలు, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జూనియర్ ఛాంబర్స్ ఇంటర్నేషనల్ (జేసీఐ) ఆధ్వర్యంలో హైదరాబాద్ ఫోనిక్స్ చాప్టర్‌లో భాగంగా శనివారం రాత్రి వనస్థలిపురంలోని వాసవి కాన్ఫరెన్స్‌హాల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు పోలీస్ అధికారులు మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. నేరం జరిగిన తర్వాత కంగారు పడకుండా సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కి కాల్ చేసి వివరాలు తెలియజేయడం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సై ఏడుకొండలు, జేసీఐ ప్రెసిడెంట్ సువిధ, నీరజ్, భాస్కర్, నందకిశోర్, భావన శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలి


సర్టిఫికెట్లు, కుట్టు మిషన్లు అందజేస్తున్న సామ రంగారెడ్డి

నాగోలు: మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు సామ రంగారెడ్డి, నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ అన్నారు. నాగోలు డివిజన్ పరిధిలోని ఇంద్రప్రస్థ కాలనీలో హ్యూమానిటీ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ ప్రెసిడెంట్ లయ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళలకు స్కిల్ డెవలప్‌మెంట్ టైలరింగ్ శిక్షణ ముగింపు కార్యక్రమానికి వారు అతిథులుగా పాల్గొని టైలరింగ్ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ శిక్షణ మహిళల జీవన ఉపాధి కోసం ఎంతో దోహదపడుతుందన్నారు. అనంతరం లక్కీ డ్రాలో విజేతలకు కుట్టు మిషన్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో వరకుమార్, నీరజ, కాశీనాథం, హరిబాబు, గోపాల్,ప్రేమ్ బాబు పాల్గొన్నారు.

చెత్తకుప్పలు.. తరలించేదెప్పుడు?



ఆర్‌కేపురం, సరూర్‌నగర్ డివిజన్ల పరిధిలోని కాలనీల్లో ఎటు చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. ఎన్‌టీఆర్ నగర్, అంబేద్కర్‌నగర్, ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా పేరుకుపోతున్న చెత్తను తరలించకపోవడంతో దుర్వాసన వస్తోందని ప్రజలు వాపోతున్నారు. దానికితోడు దోమలు, ఈగలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడేస్తున్నాయని సంబంధిత అధికారులు స్పందించి పేరుకుపోతున్న చెత్తను ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. -దిల్‌సుఖ్‌నగర్

నేడు శ్రీసరస్వతి ఉన్నత పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసాలు

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ శ్రీసరస్వతి ఉన్నత పాఠశాలలో వసంత పంచమి పర్వదినం సందర్భంగా సోమవారం చిన్నారులకు వేద పండితులచే సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ లెక్కల కృష్ణారెడ్డి వెల్లడించారు. అక్షరాభ్యాసం కార్యక్రమానికి హాజరయ్యేవారు అవసరమయ్యే సామగ్రిని తెచ్చుకోవాలని ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పూర్తి వివరాలకు 9959564939 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

కర్మన్‌ఘాట్ స్వామివారి ఆలయంలో..

చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ స్వామివారి ఆలయ ప్రాంగణంలోని శ్రీసరస్వతీ మాత ఆలయంలో సోమవారం ఉదయం 8 గంటలకు సామూహిక అక్షరాభ్యాసాలు, అన్నప్రాసనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ లావణ్య వెల్లడించారు.

'లక్ష డప్పులు వేల గొంతులు'ను విజయవంతం చేయాలి


వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మందకృష్ణ మాదిగ

నాగోలు: ఎస్సీ రిజర్వేషన్లను ఏబీసీడీలుగా వర్గీకరించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్రం ప్రభుత్వ ం అమలు చేయాలని ఈ నెల 7న నగరంలో తలపెట్టిన లక్ష డప్పులు-వేల గొంతులు మాదిగల భారీ సాంస్కృతిక ప్రదర్శన విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పిలుపునిచారు. ఆదివారం ఎమ్మార్పీఎస్ ఎల్‌బీనగర్ ఇంచార్జ్ బత్తినసుధాకర్ మాదిగ, మాదిగ కళామండలి ఆధ్వర్యంలో సరూర్ నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మంద కృష్ణ మాదిగ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ చరిత్రలోనే ఏ దేశంలో కని ఎరగని రీతిలో మాదిగల సాంస్కృతిక ఆయుధమైన డప్పుతో మహా ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి సామాజిక వర్గం, 99 శాతం ప్రజా సంఘాలు ఎస్సీ వర్గీకరణ న్యాయమైన డిమాండ్ అంటూ మన ధర్మ పోరాటానికి సంఘీభావం ప్రకటిస్తూనే ప్రత్యక్షంగా ఉద్యమంలో భాగస్వామ్యం అయ్యేందుకు సమాయత్తమవుతున్నారు. మాదిగ కళామండలి అధ్యక్షులు పల్లెపాక అనిల్ కుమార్, శ్రావణ్ కుమార్, ఎల్లయ్య పాల్గొన్నారు.

వార్షిక క్రీడోత్సవాల ముగింపు వేడుకలు


విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

రామంతాపూర్ : అరవింద్‌నగర్‌లోని విశ్వశాంతి హైస్కూల్‌లో గత రెండు రోజులుగా జరుగుతున్న వార్షిక క్రీడోత్సవాల ముగింపు వేడుకల్లో పరేడ్ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆదివారం ముగింపు కార్యక్రమానికి హాజరైన తెలంగాణ మీడియా అకాడమీ సెక్రటరీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి చూపాలన్నారు. క్రీడల్లో శిక్షణ పొంది జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదిగిన వారికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. తెలంగాణ రాజీవ్ ఆరోగ్యశ్రీ ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ గిరి, స్కూల్ డైరెక్టర్ వెంకటేశం, ప్రిన్సిపాల్ రూపారాణి తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో ఉన్నత శిఖరాలకు..

అల్వాల్: విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యం కోసం పట్టుదలతో కృషి చేయడం ద్వారానే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరవచ్చని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. నెరేడ్‌మెట్ డివిజన్ జీకే కాలనీలోని ది ఇండియన్ హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు హాజరై విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కాంగ్రెస్ బీ-బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, చంద్రశేఖర్, ఎస్ఆర్.ప్రసాద్, శంకర్, రాజు, ఇందిరా, యాదగిరి పాల్గొన్నారు.

ఫంక్షన్ హాళ్లు: అందుబాటులోకి వచ్చేదెన్నడో?

- అసంపూర్తిగా ఒకటి.. పూర్తయినా అందుబాటులోకి రాని మరొకటి
- అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారిన వైనం
- జేబులు నింపుకుంటున్న సర్కిల్ సిబ్బంది
- ఇక్కట్లు పడుతున్న ప్రజలు


అన్ని హంగులతో పూర్తయినా ప్రారంభానికి నోచుకోని మినీ ఫంక్షన్‌హాల్

చంపాపేట: పేద, మధ్యతరగతి ప్రజల సౌకర్యార్థం మల్టీ పర్పస్ ఫంక్షన్‌హాళ్లను నిర్మిస్తామన్నారు..అనుకున్నదే తడవుగా అప్పటి మంత్రితో హంగూ ఆర్భాటాలతో శంకుస్థాపన చేశారు. దశాబ్దకాలం పూర్తవుతున్నా మంజూరైన నిధులతో మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ పనులను అడపాదడపా కానిచ్చి చేతులు ఎత్తేసిన సర్కిల్ అధికారులు.. మరో మినీ ఫంక్షన్ హాల్ మాత్రం పూర్తి హంగులతో ముస్తాబు చేసినా ప్రారంభానికి మాత్రం నోచుకోకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రెండు వేల గజాల స్థలంలో రూ. 1.20 కోట్లతో..

చంపాపేట డివిజన్ సుల్తానా అల్వా కాలనీలో సుమారు 2000 గజాల ప్రభుత్వ స్థలంలో రూ. 1.20 కోట్ల జీహెచ్ఎంసీ నిధులతో పదేళ్ల క్రితమే మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్, గాంధీ విగ్రహ చౌరస్తాలో మరో మినీ ఫంక్షన్ హాల్ భవన నిర్మాణానికి నాటి మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి చేతుల శంకుస్థాపన చేసి పనులూ ప్రారంభించడంతో చంపాపేట డివిజన్ వాసుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. చిన్నపాటి ఫంక్షన్లు, వివాహాలు, సభలు, సమావేశాలకు మల్టీపర్పస్, మినీ ఫంక్షన్‌హాళ్లు ఉపయోగకరంగా ఉంటుందని కలలు కన్నారు. మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌కు మంజూరైన మొత్తం నిధులు 90 శాతం పనులకు మాత్రమే సరిపోయాయి అంటూ సదరు కాంట్రాక్టర్ చేతులు ఎత్తేయడంతో పనులు ఆగిపోయి ఆ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.


సుల్తానా అల్వా కాలనీలో అసంపూర్తిగా మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్

బల్దియా ఆదాయానికి గండి

ఇది ఇలా ఉండగా చంపాపేట గాంధీ విగ్రహ చౌరస్తాలోని మినీ ఫంక్షన్‌హాల్ విషయానికి వస్తే గత మూడేళ్ల క్రితమే అన్ని హంగులు సకల సౌకర్యాలతో నిర్మాణ పనులు పూర్తయినా ప్రారంభానికి మాత్రం నోచుకోవటం లేదు. ఫంక్షన్ హాల్ మాత్రం పూర్తయింది వేడుకలు, కార్యక్రమాలు నిర్వహించేందుకు ఎవరిని సంప్రదించాలో తెలియక గందరగోళ పరిస్థితి నెలకొంది. కొందరు శానిటేషన్ సూపర్‌వైజర్లకు గుట్టు చప్పుడు కాకుండా ముడుపులు చెల్లించి అనధికారిక కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. జీహెచ్ఎంసీకి రావాల్సిన ఆదాయాన్ని కొందరు సిబ్బంది తమ జేబుల్లోకి మళ్లించుకుంటున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆగిపోయిన ఫంక్షన్ హాల్ పనులను ప్రారంభించి, పూర్తయిన ఫంక్షన్ హాల్‌ను వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

నిర్మాణం పూర్తి చేయాలి



మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్మాణం చేపడుతున్నారంటే సంబరపడ్డాం. పదేళ్లు కావస్తోంది. 90 శాతం నిర్మాణ పనులు చేపట్టి చేతులెత్తేయటంతో మా ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. ఆ ప్రాంతం ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఫంక్షన్‌హాల్ పనులను వెంటనే పూర్తి చేయాలి.

– రాము, చిలుక బస్తీ

నిర్దిష్ట రుసుం నిర్ణయించాలి



చంపాపేట గాంధీ విగ్రహం చౌరస్తాలో మినీ ఫంక్షన్‌హాల్ అధికారికంగా ప్రారంభానికి నోచుకోలేదు. నిర్దిష్ట రుసుం ప్రకటన లేదు. శానిటేషన్ సిబ్బంది సర్కిల్ అధికారుల పేరిట వివాహ వేడుకల నిర్వాహకుల నుంచి రూ 11వేలు (హాలుకు మాత్రమే..ఇతర నిర్వహణ ఖర్చులు అదనం) వసూలు చేస్తున్నారు. చిన్న చిన్న ఫంక్షన్లకు అధికారులతో ప్రమేయం లేకుండా నేరుగా వారే జేబులు నింపుకుంటున్నారు. అధికారులు స్పందించి మినీ ఫంక్షన్ హాల్‌ను అధికారికంగా ప్రారంభించి నిర్దిష్ట రుసుం నిర్ణయించాలి.

– మహ్మద్ హబీబ్, చంపాపేట

స్పష్టత లేదు



రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబం మాది. నా కూతురు వివాహం జీహెచ్ఎంసీ మినీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిద్దామని నెల ముందుగానే రూ.11 చెల్లించి బుక్ చేసుకున్నాం. అదనంగా మరో రూ. 5 వేలు నిర్వహణ ఖర్చులు చెల్లించాలంటే ఒప్పుకున్నాం. రేపు వివాహం అనగా ఫంక్షన్ హాల్లో ప్రభుత్వ అధికారిక కార్యక్రమం ఉంది, వేరేది చూసుకోండి అని చెప్పారు. గత్యంతరం లేక అరకొర వసతులు ఉన్న కాలనీ సంక్షేమ సంఘ భవనంలో వివాహ తంతు పూర్తి చేశాం. ఫంక్షన్ హాల్ విషయమై ఎవరి దగ్గర స్పష్టత లేదు.

–రమేష్, చంపాపేట

'బ్యాంకర్ల వేధింపులు ఆపాలి'

నాగోలు: కొత్తపేట డివిజన్ పరిధిలోని సత్యనగర్ జనప్రియ అవెన్యూ అపార్ట్‌మెంట్ వాసులకు హైడ్రా నుంచి ఎలాంటి నోటీసులు రాకపోయినా మూసీ సమీపంలో ఉన్న కారణంగా బ్యాంకులు తమ రిజిస్ట్రేషన్ అయిన ప్లాట్లకు రుణాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, గతంలో ఇచ్చిన రుణాలను వెంటనే చెల్లించాలని లేకుంటే ప్లాట్లు సీజ్ చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని అపార్ట్‌మెంట్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కృష్ణాకిషోర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాము, సభ్యులు సుగుణ మాట్లాడుతూ.. జనప్రియ అవెన్యూ అపార్ట్‌మెంట్ 2002లో పూర్తిగా అధికారులతో అనుమతితో 280 ప్లాట్ల నిర్మించినట్లు వారు తెలిపారు. ఇప్పటికే బ్యాంకు రుణాలు చెల్లిస్తున్నామన్నారు. తమ అవసరాల కోసం, పిల్లల చదువుల కోసం బ్యాంక్ సిబ్బంది రుణాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాళిదాస్, రఘునందన్, ప్రభాకర్, సత్యనారాయణ, సుధాకర్, అల్బర్ట్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో భాగస్వాములవ్వాలి


సంక్షేమ భవన ప్రారంభోత్సవంలో కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో స్థానికులు భాగస్వాములవ్వాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని సాయిగణేశ్‌నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన కాలనీ సంక్షేమ సంఘం భవనాన్ని ఆదివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సాయినగర్‌కాలనీలో గతంలో రూ.1.50 కోట్లతో ట్రంక్‌లైన్ నిర్మాణం, రూ.2 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. కాలనీలో త్వరలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌రాజ్, ప్రధాన కార్యదర్శి నరసింహారాజ్, కాలనీ ప్రతినిధులు విజయ, కరుణాకర్, ఆసీఫ్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అడవి తల్లి.. గరిగుట్ట పెద్దమ్మ

- జాతరకు సిద్ధమైన జల్‌పల్లి గరిగుట్ట ఆలయం
- ఈ నెల 8 నుంచి ఉత్సవాలు ప్రారంభం
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ నిర్వాహకులు


గరిగుట్టపై ఉన్న పెద్దమ్మ ఆలయం

పహాడీషరీఫ్: జల్‌పల్లి మాదన్నగూడలోని ప్రాచీనమైన గరిగుట్ట పెద్దమ్మ అమ్మవారి ఆలయం కల్యాణ మహోత్సవాల(జాతర)కు సిద్ధమైంది. ఈ నెల 8వ తేదీ నుంచి మూడురోజుల పాటు కనుల పండువగా జరుగనున్న ఈ ఉత్సవాలను పురస్కరించుకొని ఇప్పటికే ఆలయానికి రంగులద్దడంతో పాటు ఆలయానికి వచ్చే అటవీ ప్రాంతంలోని చెట్లను కూడా జాజు, సున్నంతో అలంకరించారు. వెరసి మాదన్నగూడ అటవీ ప్రాంతం ప్రత్యేక ఆకర్షణీయతను సంతరించుకుంది. ఈ జాతరకు జల్‌పల్లి గ్రామంతో పాటు శ్రీరాంకాలనీ, మామిడిపల్లి, పహాడీషరీఫ్, చాంద్రాయణగుట్ట, సరూర్‌నగర్, బాలాపూర్, శాతంరాయి, కాటేదాన్, మధుబన్ కాలనీ, గగన్‌పహాడ్‌ల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలిరానున్నారు.

దట్టమైన అడవిలో అమ్మవారు..

జల్‌పల్లి గ్రామం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో దట్టమైన మాదన్నగూడ అటవీ ప్రాంతంలో గరిగుట్టపై పెద్దమ్మ అమ్మవారు కొలువుదీరారు. భారీ వనసంపద నడుమ వెలసిన ఈ ఆలయంలో అమ్మవారితో పాటు ఆలయ కుడిభాగంలోనే కొద్ది దూరంలో సమ్మక్క, సారక్కల గద్దెలు నెలకొల్పబడ్డాయి. అడవులకు రక్షణగా ఈ అమ్మవార్ల గద్దెలను ప్రతిష్ఠించినట్లు ప్రతీతి. అమ్మవారి ఆలయ కుడి భాగంలో కొండపైన ఆంజనేయస్వామి విగ్రహం ఉండి. దీనికి సమీపంలోనే కొండలపై రెండు గుండంలు(కోనేరు)లు ఉన్నాయి. ప్రతీ అమవాస్య, పౌర్ణమి రోజున ఇక్కడ ప్రత్యేక పూజలు జరగగా.. ఏడాదికోమారు ఉత్సవాలు జరుగుతాయి. స్వర్గీయ కరన్‌కోట కిషన్ బాబా తమ పెద్దల నుంచి వారసత్వంగా తీసుకొని ఆలయంలో పూజలు నిర్వహిస్తూ వచ్చారు. ప్రస్తుతం ఆయన కుమారుడు విఠల్ బాబా మూడు దశాబ్దాల నుంచి పర్యవేక్షిస్తున్నారు.

మాదన్న కాలంలో అమ్మవారి ఆలయ నిర్మాణం

తానీషా హయాంలో ఉన్నత పదవిలో కొనసాగిన మహేశ్వరం ప్రాంత వాసి మాదన్న ఈ అటవీ ప్రాంతం నుంచి వెళ్లే క్రమంలో శిబిరంలో నిద్రిస్తుండగా అమ్మవారు కలలో ప్రత్యక్షమై ఆదేశించడంతో అమ్మవారిని ప్రతిష్ఠించినట్లు చరిత్ర ద్వారా తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఈ ప్రాంతాన్ని మాదన్నగూడ అంటారని జల్‌పల్లి వాసులు చెబుతున్నారు. ఈ ఉత్సవాల సందర్భంగా జల్‌పల్లి గ్రామ ప్రజలు ఇంటి ఆడపడుచులు, బంధువులను ఆహ్వానించుకొని మూడురోజుల ఘనంగా ఉత్సవాలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.



ఆలయ సన్నిధిలో సమ్మక్క, సారమ్మల దిమ్మెలు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చంపాపేట: చంపాపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని సుల్తానాఅల్వా 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ పేర్కొన్నారు.ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చంపాపేట పాత బస్తీ, సుల్తానాఅల్వా, కటకోనికుంట, సాయిరాంనగర్, నేతాజీనగర్ పరిసర కాలనీల్లో విద్యుత్ ఉండదన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.11, వంకాయ రూ.23, బెండ రూ. 45, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.31, బీరకాయ రూ.38, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.11, క్యారెట్ రూ.17, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.24, ఉల్లిగడ్డ రూ.29, గోకరకాయ రూ.28, దోసకాయ రూ.18, సొరకాయ రూ.09, పొట్లకాయ రూ.13, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.40, చామగడ్డ రూ.40, మునగ రూ.75, చిలుకడ దుంప రూ.65, బీట్‌రూట్ రూ.17, కీర రూ.28, బీన్స్ రూ.50, క్యాప్సికమ్ రూ.35. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

విద్యా రంగాన్ని విస్మరించిన కేంద్రం


కరుణాకర్‌రెడ్డి

నాగోలు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వార్షిక బడ్జెట్‌లో ప్రభుత్వ విద్యా రంగానికి గత సంవత్సరం మాదిరిగానే తక్కువ నిధులు కేటాయించిందని, కేవలం 2.53 శాతం నిధులు మాత్రమే విద్యా రంగానికి కేటాయించడం బాధాకరమని ఎస్‌టీయుటీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వై. కరుణాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్రం ప్రవేశ పెట్టిన మొత్తం బడ్జెట్ రూ.50,65,345 కోట్లలో రూ.1,28, 650 కోట్లు మాత్రమే విద్యా రంగానికి కేటాయించారని అన్నారు. ఈ నిధులతో పేద విద్యార్థులకు నాణ్యమైన భోజనం, నాణ్యమైన ఉచిత విద్యా ఎలా అందిస్తారని ప్రశ్నించారు. దేశ ప్రజలకు విద్యా, వైద్యం ఉచితంగా అందిచాల్సిన పాలకులు, వాటిని విస్మరించి ప్రైవేట్, కార్పొరేట్ వైపు అడుగులు వేస్తున్నారర్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



సైదాబాద్: ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారుల సహకారంతో కృష్ణానగర్ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని కృష్ణానగర్ వెల్ఫేర్ అసోషియేషన్ ఫేస్-1 నూతన అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం కాలనీలో నిర్వహించిన సమావేశంలో కాలనీవాసులు కృష్ణానగర్ వెల్ఫేర్ అసోషియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోషియేషన్ ఉపాధ్యక్షుడిగా సునీల్, కార్యదర్శిగా గోల్డ్ శ్రీను, సంయుక్త కార్యదర్శిగా యూనస్, కోశాధికారిగా నర్సింహారెడ్డి ఎన్నికయ్యారు.

సాయినగర్ కాలనీ సంక్షేమ సంఘం ఎన్నిక..

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్ సాయినగర్ కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికలు ఆదివారం జరిగాయి. కోశాధికారిగా బీవీఎల్ఎన్ గుప్తా, ఉపాధ్యక్షుడిగా అరవింద్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక కాగా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, జాయింట్ సెక్రటరి పోస్టులకు ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 280 ఓట్లకు 183 ఓట్లు పోలవ్వగా అధ్యక్షుడిగా లక్ష్మణాచారి 100 ఓట్ల ఆధిక్యంతో, ప్రధాన కార్యదర్శిగా కొండోజు వేణుగోపాల్‌చారి 88 ఓట్లు, జాయింట్ సెక్రటరిగా భూక్యా లక్ష్మి 98 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

హయత్‌నగర్: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందిన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కాటేదాన్ టీఎన్జీవోస్ కాలనీకి చెందిన పోతులగుడి ధన్‌రాజ్ భార్య నాగమ్మ(45) తన అల్లుడు కూతురు మనవరాలితో కలిసి పల్సర్‌పై హయత్‌నగర్ నుంచి ఎల్‌బీనగర్ వైపు వెళ్తున్నారు. హయత్‌రగర్‌లోని ఇండియన్ ఓవర్‌సిస్ బ్యాంక్ సమీపంలోకి రాగానే వెనక నుంచి వేగంగా వచ్చిన నవతా ట్రాన్స్‌పోర్టుకు చెందిన వాహనం వీరి బైక్‌ను ఢీ కొట్టడంతో వెనక కూర్చున్న నాగమ్మ కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె మనవరాలికి స్వల్పంగా గాయాలైనట్లు పోలీసులు తెలిపారు.

సోనియా గాంధీ బహిరంగ క్షమాపణ చెప్పాలి

చాంద్రాయణగుట్ట: రాష్ట్రపతి ద్రౌపది ముర్ముపై సోనియా గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేయడం ఆదివాసీ గిరిజన సమాజాన్ని అవమానించిన ట్లేనని బీజేపీ చాంద్రాయణగుట్ట అసెంబ్లీ కన్వీనర్ ఎడ్ల పండరీనాథ్ మండిపడ్డారు. వెంటనే ఆమె బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి గిరిజన ఆదివాసీ వ్యతిరేక పార్టీ అన్నారు. గిరిజన మహిళ రాష్ట్రపతిగా కొనసాగడం ఆ పార్టీకి మొదటి నుంచి నచ్చడం లేదన్నారు. ఇలాంటి పార్టీ వైఖరీని దేశ ప్రజలు గమనిస్తూనే ఉన్నారని ఆయన పేర్కొన్నారు.